## క్లుప్తంగా

### దేవరగట్టులో ప్రత్యేక పూజలు



దేవరగట్టులో మాళమల్లేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**హొళగుంద:** శ్రావణమాస మొదటి ఆదివారం పురస్కరించుకుని దేవరగట్టులో మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆదివారం స్వామి వారం కావడంతో పాటు పవిత్రమైన శ్రావణ మాసం సందర్భంగా ఆలయంలో తెల్లవారుజామున సుప్రభాత సేవ, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, పుష్పార్చన, మహామంగళారతి, ఆకుపూజ, నివేదన, నీరాజన మొదలైన ప్రత్యేక పూజలను ఆలయ ప్రధాన పూజారులు మనోహర్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించి విరాట్‌మూర్తులకు నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదంతో పాటు ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

### చిరుతకు హాని తల పెట్టొద్దు

**తుగ్గలి:** మండల పరిధిలో రామకొండ సరిహద్దు కొండల్లో చిరుత సంచరిస్తున్న దృష్ట్యా సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ లక్ష్మన్న సూచించారు. డీఆర్వో రామచంద్రుడు ఆదేశాల మేరకు ఆదివారం ఆయన రామకొండ, రాంపల్లిలో పర్యటించి చిరుత సంచారంపై ప్రజలను అప్రమత్తం చేశారు. ప్రజలెవరూ భయాందోళన చెందవద్దన్నారు. చిరుత కనిపిస్తే హాని తల పెట్టవద్దని, వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు. చిరుత దాడిలో మూగజీవాలు చనిపోతే ప్రభుత్వం నుంచి వచ్చే పరిహారంపై అవగాహన కల్పించారు. ఆయన వెంట అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ శ్రీనివాసులు ఉన్నారు.

### శరవేగంగా ప్రహరీ నిర్మాణం



మద్దికెరలో కొనసాగుతున్న నిర్మాణ పనులు

**మద్దికెర:** మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ రూ.25 లక్షల నిధులతో చేపట్టిన ప్రహరీ నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ప్రహరీ నిర్మాణ పనులు పూర్తయితే ఇతరులు ఎవరూ లోపలికి రాకుండా ఉంటారని దీంతో భద్రత ఉంటుందన్నారు. అంతేగాక కస్తూర్బా విద్యాలయంలో ఉన్న విద్యార్థులు ఎలాంటి భయం లేకుండా ఉండొచ్చని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

### విద్యార్థినికి అభినందన



విద్యార్థిని అంజలిని సన్మానిస్తున్న దృశ్యం

**గోనెగండ్ల:** ఇటీవల జరిగిన నీట్ కౌన్సెలింగ్‌లో గోనెగండ్లకు చెందిన మేకల అంజలి తిరుపతి స్విమ్స్(శ్రీ వేంకటేశ్వర) మెడికల్ కళాశాలలో సీటు సాధించింది. ఈ సందర్భంగా గోనెగండ్లకు చెందిన వాల్మీకి సంఘం నాయకులు ఆదివారం అంజలి స్వగృహానికి వెళ్లి ఆమెను శాలువా, పూలమాలతో సన్మానించారు. వాల్మీకి సంఘ నాయకులు వెంకటేశ్వర్లు, శేఖర్, నాగరాజు, తిమ్మన్న, శ్రీనివాసులు, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

### వైఎస్సార్‌సీపీకే ప్రజా మద్దతు



మాట్లాడుతున్న దేశాయ్ సమీర్‌కుమార్ రెడ్డి

**వెల్దుర్తి:** వైఎస్సార్‌సీపీకే ప్రజా మద్దతు ఉందన్నది సర్పంచ్, వార్డు మెంబర్ల ఉప ఎన్నికల్లో మరోసారి రుజువైందని వెల్దుర్తి సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దేశాయ్ సమీర్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం ఆయన పట్టణంలోని తన కార్యాలయంలో వార్డు మెంబర్లుగా గెలిచిన వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు, మండల నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. సమీర్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరిగిన ఉప ఎన్నికల్లో 66 సర్పంచ్ స్థానాలకు 53 చోట్ల వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే గెలుచుకోవడం, 1062 వార్డు స్థానాలకు 810 సైతం తమ వారే గెలుచుకోవడం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమ పాలనకు నిదర్శనమన్నారు. కొద్దిపాటి స్థానాల్లో గెలిచి ప్రతిపక్ష టీడీపీ ఆనందిస్తోందని, రానున్న ఏ ఎన్నికల్లోనైనా వారికి ఇదే ఫలితాలు తప్పవన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లోనూ తమ పార్టీ విజయం ఖాయమని వార్డు ఎన్నికల్లో ప్రజాతీర్పుతో పాటు సర్వేలు సైతం స్పష్టం చేస్తున్నాయన్నారు. సమావేశంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలకు రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తామనర్నారు. వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ కొత్తూరు వెంకటేశ్వరరెడ్డి, సూదేపల్లె శరభారెడ్డి, రామళ్లకోట రాధాకృష్ణారెడ్డి, అల్లుగుండు శ్రీరాంరెడ్డి, బింగిదొడ్డి జగన్‌మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల జయకేతనం

**ఆలూరు:** గ్రామ పంచాయతీలలో ఖాళీ ఏర్పడిన వార్డు మెంబర్ స్థానాలకు ఎన్నికలు కమిషన్ ఎన్నికలు నిర్వహించింది. అందులో భాగంగా ఆలూరు నియోజకవర్గంలోని 9 గ్రామ పంచాయతీలలో ఆయా వార్డు స్థానాలకు శనివారం ఎన్నికల రిటర్నింగ్ అధికారులు పోలింగ్ నిర్వహించి విజేతలను ప్రకటించారు. మొత్తం 9 వార్డు స్థానాలకు నోటిఫికేషన్ వెలువడగా 7 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2 గ్రామ పంచాయతీలలో మాత్రమే ఎన్నికలు జరిగాయి. హొళగుంద మండలం మద్దిలింగదహళ్లి గ్రామంలో 3వ వార్డుకు జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారురాలు బసన్న గారి గోపాలమ్మ టీడీపీ బలపరిచిన అభ్యర్థి హరిజన మార్కెమ్మ పోటీపడ్డారు. పోలింగ్ ప్రశాంతంగా జరగ్గా అనంతరం అధికారులు ఓట్ల లెక్కింపు చేపట్టి గోపాలమ్మ 16 ఓట్ల మెజార్టీతో గెలుపొందినట్లు ప్రకటించి డిక్లరేషన్ అందజేశారు. అదేవిధంగా చిన్నహ్యాట గ్రామ పంచాతీలో 9వ వార్డు స్థానానికి వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి మార్కెమ్మ, టీడీపీ మద్దతుదారురాలు టీహెచ్ మంగమ్మ మధ్య పోటీ జరిగింది. అయితే మార్కెమ్మ స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. సులువాయి గ్రామంలో 7 వార్డు మెంబర్‌గా బోయ వరలక్ష్మి మాత్రమే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

- చిప్పగిరి మండలం ఏరూరు గ్రామ పంచాయతీలో 5వ వార్డుకు రాగులపాడు మంజులి, కుందనగుర్తి గ్రామంలో 7వ వార్డుకు కొండా సురేఖమ్మ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు.



మద్దిలింగదహళ్లి 3వ వార్డు మెంబర్‌గా గెలుపొందిన గోపాలమ్మకు డిక్లరేషన్ అందిస్తున్న అధికారులు (ఫైల్)

- ఆస్పరి మండలం జొహరాపురం గ్రామంలో 5వ వార్డు మెంబర్‌గా పులికొండ, యాటకల్లు గ్రామ పంచాయతీ 8వ వార్డు మెంబర్‌గా పక్కీరప్ప ఏకగ్రీవంగా గెలుపొందినట్లు ఆర్ఓ ప్రకటించారు.
- దేవనకొండ మండలం కుంకనూరు గ్రామ పంచాయతీ 8వ వార్డు మెంబర్‌గా గిట్టా వెంకటలక్ష్మి.
- పి.కోటకొండ గ్రామ పంచాయతీ 1వ వార్డు మెంబర్‌గా మునగాల జయసుధ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.
- ఆలూరు నియోజకవర్గంలో మొత్తం 9 వార్డు స్థానాలకు ఉప ఎన్నికల నోటిఫికేషన్ వెలువడగా ఏడు ఏకగ్రీవాలు, ఒక వార్డులో ఎన్నికల ద్వారా గెలుపొందడంతో 8 మంది వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులు విజయభేరి మోగించారు.



గోపాలమ్మ, ఎం.డి.హళ్లి 3వ వార్డు మెంబర్



బోయ వరలక్ష్మి, సులువాయి 7వ వార్డు, ఏకగ్రీవం



ఆర్.మంజలి, ఏరూరు 5వ వార్డు, ఏకగ్రీవం



పులికొండ, జొహరాపురం 5వ వార్డు, ఏకగ్రీవం



పక్కీరప్ప, యాటకల్లు 8వ వార్డు, ఏకగ్రీవం



వెంకటలక్ష్మి, కుంకనూరు 8వ వార్డు, ఏకగ్రీవం



ఎం.జయసుధ,పి.కోటకొండ 1వ వార్డు, ఏకగ్రీవం



బి.సురేఖమ్మ,కుందనగుర్తి 7వ వార్డు, ఏకగ్రీవం

| గ్రామ పంచాయతీ | వార్డు నంబర్ | వార్డు మెంబరు పేరు | ఏకగ్రీవం/బలపరిచిన పార్టీ |
|---|---|---|---|
| కలుగొట్ల | 11వ వార్డు | తలారి బోయ గాలమ్మ | ఏకగ్రీవం-వైఎస్సార్‌సీపీ |
| కృష్ణాపురం | 10వ వార్డు | మాదాసు మహేశ్ | ఏకగ్రీవం- వైఎస్సార్‌సీపీ |
| ఎల్ నగరం | 2వ వార్డు | నక్క లోకేశ్ | విజేత – వైఎస్సార్‌సీపీ |
| బొమ్మిరెడ్డిపల్లె | 3వ వార్డు | కోదండపాణి | విజేత – టీడీపీ |

టీడీపీ మద్దతుదారులు ఒక స్థానానికి మాత్రమే పరిమితమయ్యారు.

**పత్తికొండ నియోజకవర్గంలో..**

**వెల్దుర్తి:** నియోజకవర్గంలో వెల్దుర్తి మండలంలో 4 వార్డు స్థానాలలో (కలుగొట్ల, కృష్ణాపురం, ఎల్.నగరం, బొమ్మిరెడ్డిపల్లె) ఉప ఎన్నికలు ఎన్నికలు జరిగాయి. వాటిలో 3 స్థానాలు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు కైవసం చేసుకోగా ఒకచోట టీడీపీ బలపరిచిన అభ్యర్థి గెలుపొందారు. కలుగొట్ల, కృష్ణాపురం వార్డు మెంబర్లుగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు



తలారి బోయ గాలమ్మ, కలుగొట్ల 11వ వార్డు



మాదాసు మహేశ్, కృష్ణాపురం10వ వార్డు

ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ఎల్.నగరం వార్డు మెంబర్ స్థానానికి జరిగిన ఎన్నికలో ప్రతిపక్ష టీడీపీ అభ్యర్థిపై వైఎస్సార్‌సీపీ అభ్యర్థి 108 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.



నక్క లోకేశ్, ఎల్.నగరం 2వ వార్డు

బొమ్మిరెడ్డిపల్లె వార్డు మెంబర్ స్థానానికి జరిగిన ఎన్నికలో టీడీపీ బలపరిచిన అభ్యర్థి 12 ఓట్ల మెజారిటీతో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడిపై గెలుపొందారు.

**ఎమ్మిగనూరులో రెండు స్థానాలు ఏకగ్రీవం**

**ఎమ్మిగనూరు:** నియోజకవర్గంలో రెండు గ్రామ పంచాయతీల్లో కలిపి రెండు వార్డు స్థానాలకు ఉప ఎన్నికల ప్రక్రియ ముగిసింది. నందవరం మండలం హలహార్వి గ్రామ పంచాయతీ 7వ వార్డు అభ్యర్థిగా పోటీ చేసిన ఎం.జయమ్మ, ఎమ్మిగనూరు మండలం సోగనూరు గ్రామంలో 2వ వార్డు అభ్యర్థి చాకలి ఎల్లప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ రెండు వార్డుల్లో గతంలో టీడీపీ అభ్యర్థులుగా గెలుపొందిన వారే మృతి చెందడంతో ఈ ఎన్నికలు అనివార్యం అయ్యాయి. ప్రస్తుతం ఆ కుటుంబాలకు చెందిన అభ్యర్థులే పోటీ చేయడంతో మానవతా దృక్పతంతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు బరిలో నిలబడలేదు.

## ఇంటింటి సర్వే 82 శాతం పూర్తి



గిరిగెట్లలో ఓటరు వెరిఫికేషన్ సర్వే పరిశీలిస్తున్న తహసీల్దార్ రవి

**తుగ్గలి:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం సోమవారంతో ముగియనుంది. మండలంలో 18,710 కుటుంబాల్లోని 48,042 మంది ఓటర్లకు గాను ఆదివారం మధ్యాహ్నానికి 39,492 (82 శాతం) మందిని సర్వే చేశారు. గడువులోగా వంద శాతం సర్వే పూర్తి చేయాలని తహసీల్దార్ రవి బీఎల్వోలను ఆదేశించారు. గిరిగెట్ల, జొన్నగిరి, జీ.ఎర్రగుడి తదితర గ్రామాలలో చేస్తున్న ఓటరు వెరిఫికేషన్ సర్వేను ఆయన పరిశీలించారు.

**ఓటరు సర్వే వేగవంతం చేయండి**

**వెల్దుర్తి:** మండలంలో జరుగుతున్న ఓటరు జాబితా సవరణ సర్వేను బీఎల్ఓలు వేగవంతం చేయాలని తహసీల్దార్ శివరాముడు ఆదేశించారు. ఆదివారం సెలవు రోజైనా మండల కేంద్రంతోపాటు గోవర్ధనగిరి, మదార్‌పురం గ్రామాలలో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. ప్రతి ఇంట్లో ఓటరు వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకుని, ఆధార్ అనుసంధానంతోపాటు అవసరమైన సవరణకు ప్రతిపాదించాలని బీఎల్ఓలను ఆదేశించారు. నూతన ఓటర్లకు వెంటనే ఓటు హక్కు కల్పించేలా దరఖాస్తు చేయించాలన్నారు. మండలంలో దాదాపు 65 శాతం సర్వే పూర్తికావస్తోందని, నిర్ణీత సమయంలోపు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ మస్తాన్, వీఆర్ఓలు ఉన్నారు.



వెల్దుర్తిలో సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ శివరాముడు

## దోమకాటుతో ప్రమాదం

**మద్దికెర:** పరిసరాలు శుభ్రంగా ఉంచుకోకపోతే దోమలు వ్యాప్తి చెంది డెంగీ, మలేరియా, ఫైలేరియా, మెదడు వాపు, చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రబలే అవకాశముందని ప్రభుత్వ వైద్యాధికారులు నగేష్, శ్రీలక్ష్మి ప్రజలను అప్రమత్తం చేశారు. ఆదివారం ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా మద్దికెరలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఇంట్లో వారానికోసారి తప్పనిసరిగా ట్యాంకులలోని నీటిని పూర్తిగా తొలగించి శుభ్రం చేసుకోవాలన్నారు. దోమకాటు వల్ల మలేరియా, డెంగ్యూ వంటి అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ముందు జాగ్రత్తలు తీసుకొని వాటిని నివారించాలన్నారు. సీహెచ్ఓ నిరంజన్ బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాష, ల్యాబ్ అసిస్టెంట్ విజయ్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ ప్రకాష్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

**పత్తికొండ రూరల్:** దోమలు వ్యాప్తి చెందకుండా నివారణ చర్యలు తీసుకున్నప్పుడే రోగాల బారిన పడకుండా ఉంటామని మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు అన్నారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక ఎస్సీ బాలుర హాస్టల్ విద్యార్థులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన కూడలిలో దోమల నియంత్రణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమకాటు వల్ల సంభవించే మలేరియా, డెంగీ వంటి వ్యాధులు రాకుండా ఇంటి పరిసరాలను ప్రతి ఒక్కరూ శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. హెల్త్ అసిస్టెంట్లు రవి కుమార్, లక్ష్మిదేవి, ఎంఎల్‌హెచ్‌పీలు కరుణ, లక్ష్మి ప్రసన్న, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది



పత్తికొండలో దోమకాటుపై ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది, విద్యార్థులు

## కేంద్రాన్ని ప్రశ్నించేందుకే బస్సు యాత్ర



సమావేశంలో ప్రసంగిస్తున్న రామచంద్రయ్య

**మద్దికెర:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించేలా సెప్టెంబర్ 2వ తేదీ చేపట్టిన బస్సు యాత్రను విజయవంతం చేయాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రయ్య పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక విద్యాసాయి కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. గత 9 సంవత్సరాలుగా బీజేపీ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. 2014లో ఇచ్చిన ఎన్నికల వాగ్దానాలు అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. అలాగే పత్తికొండ ప్రాంతం పూర్తిగా వెనకబడిపోయిందని హంద్రీ నీవా నీటితో చెరువులను నింపాలన్నారు. పత్తికొండలో నిర్వహించే బహిరంగ సభలో నియోజకవర్గంలో ప్రజలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం రాష్ట్ర సమితి సభ్యులు హనుమప్ప, తాలుకా అధ్యక్షులు కారన్న, సీపీఐ మండల కార్యదర్శి హనుమప్ప తదితరులు పాల్గొన్నారు.



నాడు- మురుగునీటితో అధ్వానంగా ఉన్న హాలిగేర బీసీ కాలనీ వీధి



నేడు- సిమెంట్ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణంతో రూపుదిద్దుకున్న కాలనీ

## హాలిగేర కాలనీకి మహర్దశ

**ఆస్పరి:** మండలంలోని హాలిగేర గ్రామంలోని బీసీ కాలనీలో సచివాలయం నిధులు రూ.20 లక్షలతో చేపట్టిన సిమెంట్ రోడ్డు, డ్రైనేజీ కాలువల నిర్మాణంతో రూపురేఖలే మారిపోయాయి. ఒకప్పుడు ఆ కాలనీలో వీధుల్లో మురుగు నీరు ఆగి స్థానికులు ఇళ్లలోకి వెళ్లేందుకు కూడా ఇబ్బందికరంగా మారింది. దీనిపై గత టీడీపీ పాలనలో ఎన్నోసార్లు నాయకులకు, అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా హాలిగేర గ్రామానికి వచ్చిన మంత్రి గుమ్మనూరు జయరాం దృష్టికి కాలనీ వాసులు సమస్యలను తీసుకెళ్లారు. వారి విన్నపం మేరకు మంత్రి కాలనీని సందర్శించి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. సచివాలయం నిధులు రూ.20 లక్షలు మంజూరు చేయడంతో కాలనీలోని ఆంజనేయ స్వామి ఆలయం నుంచి కంచెమ్మవ్వ ఆలయం వరకు సిమెంట్ రోడ్డు, డ్రైనేజీ కాలువల నిర్మాణం చేపట్టారు. దీంతో కాలనీ రూపురేఖలే మారిపోయాయి. సమస్య పరిష్కారం కావడంతో కాలనీ వాసులు, సర్పంచ్ లింగమ్మ సంతోషం వ్యక్తం చేస్తూ మంత్రి గుమ్మనూరు జయరాంకు కృతజ్ఞతలు తెలిపారు.

# భక్తిశ్రద్ధలతో నాగుల చవితి వేడుకలు



మద్దికెరలో నాగులకట్టకు పూజలు చేస్తున్న మహిళలు,



చుంచుఎర్రగుడిలో నాగప్పలకు పాలు పోస్తున్న మహిళలు

**మద్దికెర:** శ్రావణమాసం నాగులచవితి సందర్భంగా ఆదివారం మండలంలోని మద్దికెర, పెరవలి, ఎం.అగ్రహారం, హంప తదితర గ్రామాలలో భక్తులు నాగుల కట్టకు పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మహిళలు, పిల్లలు నియమ నిష్టలతో ఆయా దేవాలయాలలో ప్రతిష్టించిన నాగుల కట్టను శుభ్రం చేసి నాగ ప్రతిమలకు సంప్రదాయం ప్రకారం పాలుపోసి నైవేద్యం సమర్పించారు. మరికొంత మంది పొలాలలో ఉన్న పుట్టల వద్దకు వెళ్లి పాలుపోసి భక్తిని చాటుకున్నారు. నూలు పిండి వంటలు నాగుల కట్ట వద్ద ఉంచి పూజలు చేశారు. అందరికీ ప్రసాద వితరణ చేశారు.

**తుగ్గలి:** శ్రావణ మాసంలో తొలి పండుగ నాగుల చవితిని ఆదివారం మండలవాసులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఉదయాన్నే స్నానాలు ఆచరించి పిండి వంటలు తయారు చేసుకొని కుటుంబ సభ్యులంతా నాగుల కట్టను దర్శించుకున్నారు. నాగ ప్రతిమలకు, పుట్టలో పాలు పోసి, చుట్టూ దారం చుట్టి పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. చల్లగా చూడు తల్లీ అంటూ మొక్కుకున్నారు. అనంతరం నూగుల పిండి, సలిపి పిండి అందరికీ పంచిపెట్టారు.

**హొళగుంద:** మండలంలో ఆదివారం నాగులచవితి వేడుకలు ఘనంగా జరిగాయి. పవిత్ర శ్రావణ మాసంలో జరిగే ఈ చవితి వేడుకలకు భక్తులు నాగ దేవుళ్లకు నైవేద్యంగా పలు రకాల పిండి వంటలను సమర్పించి పాలు పోశారు. హొళగుందతో పాటు పల్లెల్లో నాగ దేవత విగ్రహాలకు పాలాభిషేకం చేసి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. విగ్రహాలతో పాటు పుట్టల్లో పాలు పోసి మొక్కుబడులు తీర్చుకున్నారు. అనాదిగా వస్తున్న సంప్రదాయాలను పాటిస్తూ భక్తులు పుట్టలను ప్రత్యేకంగా అలంకరించారు. ఆయా గ్రామాల్లో వేడుకలు ఘనంగ జరిగాయి.

**కృష్ణగిరి:** నాగుమ్మ.. చల్లగా చూడమ్మా అంటూ మండలంలోని అన్ని గ్రామాల్లో నాగులచవితిని పురస్కరించుకుని ఆదివారం భక్తిశ్రద్ధతో పూజలు నిర్వహించి పుట్టకు పాలు పోశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి రైతన్నల ఇళ్లల్లో సిరులు పండాలని కోరుకున్నారు. నూతన దంపతులు నాగులకట్టకు పాలు పోశారు.

## బస్సు యాత్ర జయప్రదం చేయండి

**ఆస్పరి:** వేదావతి ప్రాజెక్టు ద్వారా ఆస్పరి మండలానికి తాగు, సాగు నీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ సెప్టెంబర్ 2వ తేదీన ఆలూరు నుంచి చేపట్టే బస్సు యాత్రను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి విరుపాక్షి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని కై రుప్పల గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆస్పరి మండలంలో ఎలాంటి ప్రాజెక్టులు లేవని, కేవలం వర్షాధారంపైనే ఇక్కడి రైతులు ఆధారపడి పంటలు సాగుచేస్తున్నారన్నారు. వర్షాలు సకాలంలో కురవక ఏటా నష్టాలు చవిచూస్తున్నారన్నారు. వేదావతి ప్రాజెక్టు ద్వారా ఆస్పరి మండలానికి నీటి సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఏఐవైఎఫ్ నాయకులు శ్రీనివాసులు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు 'స్పందన' కార్యక్రమం

**కృష్ణగిరి:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ రాజేశ్వరి ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ తప్పక హాజరుకావాలని ఆయన కోరారు. ప్రజలు సమస్యలపై ఈ కార్యక్రమంలో అర్జీలు ఇస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆమె తెలియజేశారు.

## రాజీవ్‌గాంధీకి నివాళి

**ఎమ్మిగనూరుటౌన్:** మాజీ ప్రధాని దివంగత నేత రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఎస్సీ వసతి గృహం ఆవరణలో ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా చైర్మన్ ఖాశీంవలి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశంలో ఐటీ రంగానికి పునాదులు వేసిన నేత రాజీవ్‌గాంధీ అని కొనియాడారు. నాయకులు కుమార్, చాంద్‌బాష తదితరులు పాల్గొన్నారు.

## జేసీఎస్‌లు సమర్థవంతంగా పనిచేయాలి

**ఆలూరు:** రానున్న రోజుల్లో క్షేత్రసాయిలో కీలక పాత్ర జేసీఎస్ సైన్యందేనని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ స్థాయి జేసీఎస్, సచివాలయ, మండల కన్వీనర్లు, వివిధ మండలాల ప్రజా ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా జేసీఎస్‌లు బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షేమ పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తూనే, గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనతో తేడాను వివరించి వారిని చైతన్యం చేయాలన్నారు. ప్రభుత్వ విమర్శకులపై తగిన రీతిలో సమాధానం చేప్పాలని దిశానిర్దేశం చేశారు. మంత్రి సోదరులు నారాయణస్వామి, శ్రీనివాసులు, మండల కన్వీనర్లు, వీరేష్, భీమప్ప, షఫివుల్లా, మల్లికార్జున, పెద్దయ్య, నాయకులు మారయ్య, దివాకర్‌నాయుడు, శేషప్ప శ్రీనివాసులు, గోవర్ధన్, ఈరన్న, మల్లికార్జున, ఈరన్న, బసవరాజ్, రాజారెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి గుమ్మనూరు జయరాం

## సస్యరక్షణ చర్యలు పాటించాలి

**గోనెగండ్ల:** పంటలసాగులో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మిగనూరు వ్యవసాయ సహాయ సంచాలకులు మహమ్మద్ ఖద్రి, ఏఓ హేమలత రైతులకు సూచించారు. ఆదివారం మండలంలోని కున్నూరు గ్రామంలో వారు పత్తి, ఆముదం, మిరప పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న వర్షాభావ పరిస్థితుల్లో మొక్కలు బెట్టకు గురి కాకుండా 2 శాతం యూరియా ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. పత్తి పంటలో ఆల్టర్నేరియా ఆకు మచ్చ తెగులు గమనించారు. ఆకులపై గోధుమ రంగు వలయాకార మచ్చలు సుడులు సుడులుగా ఏర్పడతాయని, తెగులు తీవ్రతను బట్టి ఆకులు చిరిగిపోవడం, రాలిపోవడం జరుగుతుందన్నారు. ఈ తెగులు నివారణకు ప్రొపికొనజోల్ 1 మిల్లీ లీటర్ నీటికి లేదా హెగ్జాకొనజోల్ 2 మిల్లీ లీటర్లు ఒక లీటర్ నీటికి కలుపుకొని పిచికారీ చేసుకోవాలన్నారు. ఆముదం పంటలో నామాల పురుగు ఉధృతిని గమనించారు. ఈ పురుగు నివారణకు ప్రొఫినోఫాస్ 2 మిల్లీ లీటర్లు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. మిరప నాటే రైతులు ఎకరానికి 5 కిలోల వేప పిండి, 5 కిలోల గుళికలు, 10 కిలోల జింక్ సల్ఫేట్ వేయాలని, వేరు కుళ్లు తెగులు నివారణకు 100 కిలోల బాగా చవికిన పేడలో 2 కిలోల ట్రైకోడెర్మ విరిడి కలిపి నీడకు పెట్టి రోజు నీరు వేస్తూ వారం రోజుల తర్వాత పొలంలో వేసుకోవాలని సూచించారు. వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



కున్నూరులో ఆముదం పంటను పరిశీలిస్తున్న ఏడీఏ మహమ్మద్ ఖాద్రి, ఏఓ హేమలత

## అవుట్ సోర్సింగ్ విధానం రద్దు చేయాలి

**ఎమ్మిగనూరుటౌన్:** ప్రభుత్వ ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేయాలని ఏఐటీయూసీ తాలుకా అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, తిమ్మగురుడు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. శాశ్వత విధుల్లో పనిచేసే వారినందరినీ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల్లో కనీస వేతన బోర్డును ఏర్పాటు చేసి కనీస వేతనాలు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు ముక్తార్, అమృతరాజు, శేఖర్, వలి తదితరులు పాల్గొన్నారు.

## అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

**పత్తికొండ రూరల్:** పత్తికొండ-కర్నూలు రోడ్డులో వెలసిన అభయాంజనేయ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి అర్చకుడు రవి జలాభిషేకం, పంచామృతాభిషేకం, సహస్రనామార్చన తదితర పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం దాతలు బత్తిన లోకనాథ్, శ్రీకాంత్‌చౌదరి సహకారంతో భక్తాదులకు అన్నదానం ఏర్పాటుచేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.